సాక్షి వరంగల్

గురువారం । 31 । అక్టోబర్ । 2024



నాణ్యమైన పరిశోధనలపై..

కేయూలో విద్యార్థులకు నాణ్యమైన పరిశోధనలు జరిగేలా విభాగాల అధిపతులు దృష్టి సారించాలని వీసీ ప్రతాప్‌రెడ్డి సూచించారు.

- 8లో▸



క్రీడల్లో గెలుపోటములు సహజం

క్రీడల్లో గెలుపోటములు సహజమని ఐటీడీఏ డీడీ పోచం అన్నారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల గిరిజన విద్యార్థుల జోనల్ స్థాయి క్రీడలు ముగిశాయి.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం

$31^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రి పొగమంచుతో చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

వర్షపునీటిని ఒడిసి పట్టుకోవాలి



సంగెం: వర్షపు నీరు వృథాగా పోకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకేలా ఒడిసి పట్టుకోవాలని జిల్లా భూగర్భజల శాఖాధికారి అశోక్ అన్నారు. బుధవారం గీసుకొండ మండలం కొనాయమాకులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'భూగర్భజల మట్టం పెంపు, భూగర్భ జలాల నియంత్రణ' అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటిని పొదుపుగా వాడుకుంటూ భావితరాలకు ఆస్తిగా అందించాల్సి బాధ్యత సమాజంలోని అందరిపై ఉందన్నారు. వ్యవసాయంలో అవసరం మేరకే నీటిని వినియోగించుకోవాలని, బిందు, సూక్ష్మనీటి పద్ధతులను పాటించాలన్నారు. అధికారుల సాంకేతిక సలహాలు తీసుకుని బోర్‌బావులను నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో భూగర్భజల శాస్త్రవేత్త రవి, ఎస్సై కుమార్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమణాకర్, పీస్ ఫర్ ఆల్ నేషన్స్ సాల్మన్‌రాజు, డైరెక్టర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పని విధానం మారాలి

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో అధికారుల పని విధానం మారేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ కలెక్టర్ సత్యశారదను కోరారు. బుధవారం వినతి పత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయాల మధ్య ఉన్న తేడాల వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఏనుమాముల మార్కెట్ అధికారులకు తెలియకుండానే చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులు ధరల విషయమై చేస్తున్న నిర్ణయాలు మార్కెట్ నియమాలకు విరుద్ధంగా ఉండడం శోచనీయమన్నారు. చాంబర్ నిర్ణయాల తీర్మానం కాపీ మార్కెట్ అధికారులకు అందించాలన్నారు. ఇరువురి సమన్వయంతో ధరల ప్రకటన చేయాలని కోరారు. ధరల క్రమబద్ధీకరణ విచ్ఛిన్నం అయితే రైతులకు మార్కెట్‌పై విశ్వాసం సన్నగిలుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఓదెల రాజయ్య, అంబయ్య, రవీందర్, నాగేశ్ పాల్గొన్నారు.

పత్తిని ఆరబెట్టి తీసుకొస్తేనే మద్దతు ధర

వరంగల్: పత్తిని ఆరబెట్టి తీసుకొచ్చిన రైతులు సీసీఐకి విక్రయిస్తే కనీస మద్దతు ధర లభిస్తుందని, పత్తిలో 12శాతం తేమ కంటే ఎక్కువ ఉండరాదని సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్ దుబే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పత్తి సీజన్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని, సీసీఐకి విక్రయించాలంటే పత్తిలో తేమ 8 శాతం మించకపోతే పూర్తి కనీస మద్దతు ధర, 8శాతం నుంచి 12శాతం వరకు తేమ ఉంటే ఎంఎస్పీ కంటే ప్రతి ఒక్క శాతానికి తగ్గింపు ధరలతో సీసీఐ చెల్లిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు మొబైల్ యాప్ Cott-Ally ను ఇన్‌స్టాల్ చేసుకోవాల పేర్కొన్నారు. పత్తి రైతులు సాయం కోసం వరంగల్ సీసీఐ బ్రాంచ్ కార్యాలయం ఫోన్ నంబర్ 0870–2565077 ద్వారా సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మెడికల్ కళాశాలలో నిర్వహించే పారా మెడికల్ కోర్సులకు అడ్మిషన్ పొందే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నర్సంపేట మెడిల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ దాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారా మెడికల్ కళాశాలలో డీఈసీజీ, డయాలసిస్ కోర్సులు ఉన్నాయని, నవంబర్ 11వ తేదీలోగా దరఖాస్తుతోపాటు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను నర్సంపేట మెడికల్ కళాశాలలో అందించాలని సూచించారు. దరఖాస్తు ఫారం, పూర్తి వివరాలకు tgpmb.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఎంజీఎం: పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ గడువు నవంబర్ 11వ తేదీ వరకు పొడిగించినట్లు కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను జతపరిచి స్వీయ ధ్రువీకరణతో కేఎంసీలో సమర్పించాలని పేర్కొన్నారు. తప్పుడు సమాచారం, సర్టిఫికెట్లు సమర్పిస్తే అలాంటి దరఖాస్తులు తిరస్కరిస్తామని సూచించారు. పూర్తి వివరాలకు www.tgpmb.telangana.gov.in వెబ్‌సైట్ సందర్శించాలని ఆయన పేర్కొన్నారు.



చీకటి తొలగితేనే.. జీవితంలో వెలుగు

అప్పుడే ఇంటింటా దీపావళి • అజ్ఞానం వీడి చైతన్యవంతులవ్వాలి

- జ్ఞానజ్యోతులతో జీవితం ఆనందమయం
- పొదుపుగా ఉంటేనే ఆ ఇంట్లో పుష్కలంగా లక్ష్మి
- దీపావళి పండుగ చెబుతున్న సారాంశమిదే..

హన్మకొండ కల్చరల్:

అజ్ఞానమనే చీకటి నుంచి విజ్ఞానమనే వెలుగులోకి పయనించి జీవితంలో కొత్త అర్థాలు వెతుక్కోవాలన్నదే దీపావళి పండుగ సారాంశం. దీపం ఉన్న చోట జ్ఞాన సంపద ఉంటుంది. దీపం సాక్షాత్తు లక్ష్మీదేవి స్వరూపంగా చెబుతారు. దీపావళి రోజు దీపలక్ష్మి తన కిరణాలతో ప్రపంచాన్ని కాంతిమయం చేస్తుంది. భక్తి శ్రద్ధలతో నమస్కరిస్తే సకల సంపదలు కలుగుతాయి. చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా అందరూ ఆనందంతో జరుపుకునే పండుగ. నరకాసుర వధతో ఆరంభమై.. అందరి జీవితాల్లో పెనుమార్పు వచ్చి.. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని బంగారు భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నదే దీపావళి పర్వదిన ముఖ్య ఉద్దేశమని ఆధ్యాత్మిక వేత్తలు పేర్కొంటున్నారు. ఇంట్లోని ప్రతికూల శక్తులను తొలగించి.. నూతన వెలుగులను తీసుకువచ్చే గొప్ప పండుగ. ఆశ్వయుజ బహుళ అమావాస్య రోజు ఈ పండుగను జరుపుకోనున్నారు. గురు, శుక్రవారాల్లో జరుపుకునేందుకు ప్రజలు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



చెడు గుణాలపై సాత్విక గుణాల విజయమే..

పూర్వం మురాసురుడు, నరకాసురుడు అనే సోదర ద్వయమైన రాక్షసులు ప్రజలను బాధించేవారు. ఇలాంటి రాక్షసులను చంపడం దేవతలకు కూడా వశంకాకపోవడంతో వారు శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తారు. ద్వాపరయుగంలో మానవుడిగా జన్మించిన శ్రీకృష్ణుడు ఆశ్వయుజ బహుళ త్రయోదశి చతుర్దశి తిథుల సంధి కాలంలో సత్యభామ సమేతుడై మురాసురుడ్ని, నరకాసురుడ్ని సంహరించాడని పురాణ కథ. ఇది కథే అయినా సమాజంలోనూ ఇలాంటి రాక్షసులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో చిన్న పిల్లలపై లైంగికదాడులు చేసిన, చేస్తున్న ఘటనలు చూస్తూనే ఉంటాం. అమాయక ప్రజలకు మత్తు పదార్థాలను విక్రయించి బానిసలు చేసే వారూ ఈ కోవకు వస్తారు. ఇలాంటి వారి సమాచారాన్ని పోలీసులకు అందిస్తే వారి ఆగడాలకు అడ్డుకట్ట పడుతుంది. ఇది మనవంతు బాధ్యతగా నిర్వర్తించాలి.

వినయం, విధేయత, క్రమశిక్షణే దీపకాంతి

దీపకాంతిని త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ప్రతీకగా పేర్కొంటారు. వినయం, విధేయత క్రమశిక్షణతో జీవితాన్ని కొనసాగిస్తే వారి కుటుంబాల్లో ఆర్థికస్థితి మెరుగుపడడటమే కాకుండా ఉన్నత స్థాయికి చేరుకోవడానికి నాంది పలుకుతుంది. ఉజ్వల భవిష్యత్‌ను అందుకుని తమ కుటుంబానికి అండగా నిలుస్తారు. సమాజంలో ఆదర్శంగా వెలుగుతారు.

సరదా.. కాకూడదు విషాదం

దీపావళిని ఆనందంగా జరుపుకోవాలి

- 8లో▸

శ్రద్ధతోనే జ్ఞానజ్యోతి



చదువుకుని తమ జీవిత లక్ష్యాన్ని సాధించాలనుకునే యువతలో కొంత మంది పెడదారి పడుతున్నారు. మత్తుపదార్థాలకు బానిసలై జీవితాలను చిన్నతనంలోనే కోల్పోతున్నారు. వరంగల్‌లో శివనగర్, ఏసీరెడ్డి నగర్‌లో ఇటీవల కొంతమంది విద్యార్థులు గంజాయిని విక్రయిస్తూ టాస్క్‌ఫోర్స్ అధికారులకు పట్టుబడి కటకటాలపాలయ్యారు.. ఇప్పటికైనా ఈ దీపావళి వారి జీవితాల్లో మార్పు తెచ్చి వారు ఉన్నతస్థాయికి ఎదగాలి. చదువుపై శ్రద్ధపెట్టి లక్ష్యాన్ని సాధించాలి. అందుకు వారు జ్ఞానజ్యోతి వెలిగించాలి.. మద్యం మత్తులో బీటెక్ విద్యార్థులు రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు వదులుతున్నారు. ఈ దీపావళితో మార్పు వచ్చి తల్లిదండ్రుల ఆశయాల కోసం ఉన్నతంగా నిలవాలని కోరుకుందాం. చీకట్లు తొలగి వారి జీవితాల్లో ఆనందమైన ఈ దీపావళి వెలుగులు నింపాలని కోరుకుందాం.

అనురాగాల జ్యోతులు వెలగాలి



ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఆనందాలహరివిల్లులా విలసిల్లేవి. కుటుంబసభ్యులు కలిసిమెలిసి ఉండడం, అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ముల సఖ్యత కుటుంబాల్లో సంతోషాన్ని నింపేవి. ఈ మధ్య కాలంలో ఉమ్మడి జిల్లాలో ఆస్తి వాటాలు, భూమి పంపకాల తగాదాలు ఎక్కువయ్యాయి. అన్నదమ్ముల తగాదాలు.. హత్యల వరకు దారితీస్తున్నాయి. ప్రతి కుటుంబంలో ఈ దీపావళి ఆప్యాయత, అనురాగాల జ్యోతులు వెలిగించాలి.

సకల సంపదల దీపలక్ష్మి వెలిగించాలి..



ధనం మూలం.. ఇదం జగత్ కాబట్టి కష్టపడి పనిచేసి డబ్బును సంపాదించడం నేర్చుకోవాలి. లక్ష్యసాధన కోసం మన మనస్సులో సకల సంపదల దీపలక్ష్మి వెలిగించాలి. ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మహిళలు, పురుషులు ప్రభుత్వ కొలువులు సాధించారు. నగరంలోని పలువురు మహిళలు పొదుపు సంఘాలను ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా లభించిన ఆదాయంతో వ్యాపారాల్లో రాణిస్తున్నారు. విద్యార్థులు అవసరాన్ని బట్టి సెల్‌ఫోన్లను వాడాలి. కానీ, కాలక్షేపం కోసం వాడుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దు. పట్టుదలతో చదివి ఉద్యోగాలు పొందాలి. ఇందుకు ఏకాగ్రత కోసం యోగా, ధ్యానం చేయాలి.



సత్యభామలా కావాలి..

ఉమ్మడి జిల్లాలో పోకిరీల బెడద ఎక్కువైంది. రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళలు, కాలేజీ విద్యార్థినులను ఈవ్‌టీజింగ్ చేస్తున్నారు. వరకట్న వేధింపులు, లైంగికదాడులు చూస్తున్నాం. ఇలాంటి ఘటనలకు ఎవరూ భయపడొద్దు. సత్యభామ విల్లు ఎక్కుపెట్టి నరకాసురుడిని వధించినట్లు ఆమె ధైర్యాన్ని స్ఫూర్తిగా తీసుకుని భయపడకుండా షీటీమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇటీవల గ్రేటర్ వరంగల్‌లో విద్యార్థినుల సమాచారంతో షీటీమ్ పోలీసులు పలువురు పోకిరీల పని పట్టారు. తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు.

అక్రమ అనుమతులపై డీఎల్‌పీఓ విచారణ

సాక్షి ఎఫెక్ట్


సంగెం: మండలంలోని గుంటూరుపల్లి గ్రామపంచాయతీలో అక్రమ అనుమతులపై ఎట్టకేలకు డీఎల్‌పీఓ, మండల ప్రత్యేకాధికారి వేదవతి బుధవారం విచారణ చేపట్టారు. గుంటూరుపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అనిత.. మొండ్రాయికి బదిలీపై వెళ్లి ఏడాది గడిచింది. అయినప్పటికీ ఈ పంచాయతీ యూజర్ ఐడీ, పాస్ వర్డ్ నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి సరితకు ఇవ్వలేదు. దీంతోపాటు అక్రమంగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిందనే విషయాలపై ఈ నెల 4వ తేదీన 'సాక్షి'లో 'అక్రమ అనుమతులపై చర్యలు శూన్యం' అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై ఆలస్యంగా స్పందించిన డీఎల్‌పీఓ.. గుంటూరుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పలువురు గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ పంచాయతీ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను నూతన కార్యదర్శి సరితకు ఇప్పించారు. గ్రామస్తులు, పాత పంచాయతీ కార్యదర్శిని విచారించి రాతపూర్వకంగా వివరణ తీసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని దోషిగా తెలినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కొమురయ్య, పాత, కొత్త పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గుంటూరుపల్లిలో విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ వేదవతి

ఉర్సుగుట్టలో నరకాసుర వధ

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట మైదానంలో బుధవారం సాయంత్రం నరకాసుర వధ నిర్వహించారు. నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి, సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు భారీగా ప్రజలు తరలివచ్చారు. ఉర్సు ప్రతాప్‌నగర్ నుంచి ప్రత్యేక రథంపై కృష్ణుడు, సత్యభామ ఉత్సవ మూర్తులతోపాటు యువతులు ధనస్సు చేతబట్టి కృష్ణుడు, సత్యభామ వేషధారణతో మైదానానికి చేరుకున్నారు. ఉర్సు గుట్ట మైదానంలో 58 అడుగుల భారీ నరకాసురుడి ప్రతిమను ఏర్పాటు చేశారు. అతిథులతో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి ఆటోమెటిక్ ఎలక్ట్రిక్ పరికరాన్ని రాత్రి 8 గంటలకు స్విచ్ ఆన్ చేసి నరకాసురుడి ప్రతిమను దహనం చేశారు. 20 మందికి పైగా టెక్నీషియన్లు పేల్చిన బాణసంచా మోతలతో రంగలీల మైదానం దద్దరిల్లిపోయింది. వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన శ్రీకృష్ణ, సత్యభామ నాటకం, పేరిణ శివతాండం, కూచిపూడి నత్యాలు, జానపద గేయాలు, తెలంగాణ ఆటపాటలు ప్రేక్షకులను అలరించాయి. సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా పర్యవేక్షణలో ఏసీపీ నందిరాంనాయక్, ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సైలు సురేశ్, రవీందర్, 100 మంది స్పెషల్ పోలీసుల బందోబస్తు నిర్వహించారు.



నరకాసుర వధ ఉత్సవాలకు హాజరైన ప్రజలు

సర్వేకు సర్వం సిద్ధం

- 1,841 ఎన్యుమరేటర్ల నియామకం
- నవంబర్ 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే
- జిల్లా నోడల్ అధికారిగా జెడ్పీ సీఈఓ

సాక్షి, వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సర్వే) కు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ సర్వే పారదర్శకంగా ఉండేలా, సర్వే విషయాలను గోప్యంగా ఉంచేలా, ఎలాంటి తప్పులు లేకుండా చేసేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే 1,841 మంది ఎన్యుమరేటర్లు శిక్షణ పొందుతున్నారు. జిల్లా నోడల్ అధికారిగా జెడ్పీ సీఈఓ రామిరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న ఈ సర్వేలో ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి సర్వే చేస్తారు. దీనిపై మండల స్థాయిలో కూడా శిక్షణ ఇస్తున్నారు. సర్వే వివరాల సేకరణ అనంతరం డేటా ఎంట్రీ సైతం పక్కగా సంబంధిత గణకుడు నిర్వహించేలా మార్గదర్శనం చేస్తున్నారు.

పది మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్..

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 2.63 లక్షల కుటుంబాలున్నాయి. 150 కుటుంబాలకు ఒక గణకుడు చొప్పున 1,841 ఎన్యుమరేటర్లచే సర్వే చేయనున్నారు. పది మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్ వైజర్‌ను నియమించారు. నవంబర్ మూడు నుంచి ఆరో తేదీ వరకు గృహాల లిస్టింగ్ చేసుకొని నవంబర్ ఆరు నుంచి సర్వే ప్రారంభించనున్నారు. ఇంటి నంబరు ఆధారంగా ఎన్యుమరేటర్లు వారికి కేటాయించిన కుటుంబాల వివరాలను క్రమ పద్ధతిలో నమోదు చేస్తారు. ప్రతి ఇంట్లో నివసించే వారి సంఖ్యను నిర్ధారించడంతోపాటు ప్రతి కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించి (ఇంటి నంబరు, ఇంటి యజమాని పేరు వంటి వివరాలు) ఫారంలో నమోదు చేస్తారు. ముఖ్యంగా ఐదేళ్లుగా ఏమైనా రుణాలు తీసుకున్నారా..? వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లో పాల్గొన్నారా? పశుసంపద, కుటుంబ సభ్యుల స్థిరాస్తి, చరాస్తి వివరాలు, ఇంట్లో నివాస గదుల సంఖ్య వంటి వివరాలు కూడా నమోదు చేయనున్నారు. నివాస గృహ విస్తీర్ణం, ఏమైనా పథకాలు లబ్ధి పొందారా? రాజకీయ నేపథ్యం ఉందా? ఏ హోదాలో ఉన్నారు. కుటుంబంలో ఎవరైనా వలస వెళ్లారా? విదేశం వెళితే దేశం పేరు, ఇతర రాష్ట్రం వెళ్తే రాష్ట్రం పేరు, వలస వెళ్లడానికి కారణం, ఎంత భూమి ఉంది, ధరణి పాస్ బుక్ ఉంటే నంబర్, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారా, కుల వృత్తిలో కొనసాగుతున్నారా.. తదితర వివరాలను సేకరించనున్నారు. సర్వే పూర్తయిన తర్వాత వివరాలు నింపిన స్టిక్కర్‌ని ఇంటి గోడపై అతికిస్తారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

మార్గదర్శకాలపై ప్రత్యేక శిక్షణ

సామాజిక, ఆర్థిక, సర్వే మార్గదర్శకాలపై మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, సూపర్ వైజర్లకు బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి కలెక్టర్ సత్యశారద శిక్షణ నిర్వహించారు. నవంబర్ ఆరు నుంచి 18 వరకు నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎన్యుమరేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే సమయంలో ఎన్యుమరేటర్లు ప్రజలతో గౌరవంగా, హుందాగా వ్యవహరించాలన్నారు. ఈ సర్వే ఉద్దేశంపై ప్రజలకి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, సీపీఓ గోవిందరాజులు, డీఆర్డీఓ కౌసల్యాదేవి, ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి

- కలెక్టర్ సత్య శారద

వరంగల్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ కోసం ఏర్పాటు చేసిన అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేసి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియ పురోగతి, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 31,800 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు రాగా.. 1,957 దరఖాస్తులు మాత్రమే పరిశీలన మాత్రమే పూర్తికావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ పరిశీలన బృందం ప్రతిరోజు ఇరవై దరఖాస్తులను పరిశీలించి నివేదికను అదే రోజు అందజేయాలన్నారు.

203 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. జిల్లా సివిల్ సప్లయీస్ శాఖ ధాన్యం కొనుగోళ్లపై బుధవారం కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి కలెక్టర్, సమీక్షించారు. ఇప్పటివరకు 14 కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తోట సంపత్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో తాలు, తరుగు, మట్టి పేల్లలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ధాన్యం కొనుగోలు సెంటర్ ఇన్‌చార్జ్‌లదే అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను వ్యవసాయశాఖ అధికారులు రైతులకు వివరించాలన్నారు. డిఫాల్టర్ రైస్ మిల్లర్లకి ఈసీజన్లో ధాన్యం ఇవ్వడంలేదని, బ్యాంకు గ్యారంటీలు ఇచ్చిన మిల్ల ర్లకు మాత్రమే ధాన్యం కేటాయిస్తారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద, పక్కన అదనపు కలెక్టర్ సంధ్యారాణి

తెలంగాణ దర్శినిలో చారిత్రక ప్రదేశాల సందర్శన

విద్యార్థులు 'తెలంగాణ దర్శిని' కార్యక్రమంలో చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో సంబంధితశాఖల అధికారులతో జిల్లాలోని విద్యార్థులు చారిత్రక, పర్యాటక ప్రదేశాలను అన్వేషించడానికి సిద్ధం చేస్తున్న ప్రణాళికపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. టూరిజం క్లబ్స్‌లో సభ్యత్వం పొందిన విద్యార్థులతో పాటు వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను ఉమ్మడి జిల్లాతోపాటు చుట్టుప్రక్కల జిల్లాలలో చారిత్రక, పర్యాటక ప్రాంతాలను తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి రత్నకుమారి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ సిటీ ప్లానర్ రవీంద్ర రడేకర్, డీసీఓ నీరజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, సివిల్ సప్లయీస్ డీఎం సంధ్యారాణి, డీసీఎస్ఓ కిష్టయ్య, డీఎంఓ సురేఖ, బండారి దామోదర్, సత్యనారాయణ, నరేందర్, డీఈఓ జ్ఞానేశ్వర్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సౌజన్య, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ సూర్య కిరణ్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా ప్రజలందరికీ దీపావళి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

యశోద హాస్పిటల్స్

యశోద మెడికల్ సెంటర్

1వ అంతస్తు, జై గోవింద్ కాంప్లెక్స్, ఎస్‌బిఐ పక్కన, నక్కలగుట్ట, హన్మకొండ

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది - సమయం
[illegible] రోబోటిక్ సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, రికన్‌స్ట్రక్టివ్ యూరాలజీ, ల్యాప్రోస్కోపిక్ యూరాలజీ, అడ్వాన్స్‌డ్ ఎండోయూరాలజీ, యూరో-అంకాలజీ, ఆండ్రాలజీ మరియు మేల్ ఇన్‌ఫెర్టిలిటీ, ఫిమేల్ & న్యూరో యూరాలజీ, పీడియాట్రిక్ యూరాలజీ	[illegible] MS (Gen Surg), DNB (Gen Surg), M.Ch (Urology) [illegible]	01-11-2024 1వ శుక్రవారం
[illegible]	[illegible]	02-11-2024 1వ శనివారం
[illegible]	[illegible] MD, DM (Endocrinology) సీనియర్ కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్	03-11-2024 1వ ఆదివారం
[illegible]	[illegible] MBBS, MS (General Surgery), DNB (Vascular Surgery) [illegible]	
[illegible]	[illegible]	05-11-2024 1వ మంగళవారం
[illegible]	[illegible]	06-11-2024 1వ బుధవారం
[illegible]	[illegible] MD, FCCP, FAPSR (Pulmonology) [illegible]	
[illegible]	[illegible] MBBS, MD, DM (Nephrology) [illegible]	
[illegible]	[illegible]	
[illegible]	[illegible] MD, DM (Gastro) [illegible]	07-11-2024 1వ గురువారం
[illegible]	[illegible]	
[illegible]	[illegible]	

అపాయింట్‌మెంట్ కొరకు: 0870 - 2427777 | 2447778 | 2447779 | 707 570 4542



'సాక్షి' ఫొటో జర్నలిస్టు మురళీమోహన్‌కు ఉమ్మడి రాష్ట్రాల అవార్డు


జిల్లెలమూడి మురళీమోహన్


అవార్డు లభించింది ఈ ఫొటోకే..

మహబూబాబాద్ రూరల్ : 'సాక్షి' మహబూబాబాద్ జిల్లా ఫొటో జర్నలిస్టు జిల్లెలమూడి మురళీమోహన్ ఉమ్మడి రాష్ట్రాల స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల ఫొటో జర్నలిస్టులకు నిర్వహించిన ఫొటోగ్రఫీ జర్నలిజం కాంపిటీషన్లలో ప్రకృతి వైపరీత్యాల విభాగంలో మురళీమోహన్ తీసిన ఫొటోను ఎంపిక చేసినట్లు అవార్డుల ప్రదానోత్సవ నిర్వాహకులు తెలిపారు. ప్రపంచ ఫొటోజర్నలిజం దినోత్సవాన్ని ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండి యా సంయుక్తంగా విజయవాడ కేంద్రంగా నిర్వహిస్తున్నాయి. నవంబర్ 1వ తేదీన సాయంత్రం 5.30 గంటలకు విజయవాడలోని ఎంజీ రోడ్ లోగల బాలోత్సవ్ భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులు గా ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కె.మన్మథరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, తదితరులు హాజరై మురళీమోహన్‌కు అవార్డును అందజేయనున్నారు.

సరదా.. కాకూడదు విషాదం

దీపావళి రోజున ప్రియనేస్తాలు భద్రం



- బాణాసంచా పేల్చడంలో మెళకువలు పాటించి పెంపుడు జంతువులను రక్షించుకోవాలి
- పండుగ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ కరుణాకర్ రెడ్డి పలు సూచనలు

కాజీపేట: దేశ ప్రజలకు అత్యంత ఇష్టమైన పండుగల్లో దీపావళి ఒకటి. ఈ రోజున బాణాసంచా పేల్చడం, మందుగుండు సామగ్రిని కాల్చడం ద్వారా అమితానాందం కలుగుతుంది. అయితే పేలుళ్ల వల్ల పెంపుడు జంతువులు(కుక్కలు, పక్షులు, పశువులు) భయాందోళనకు గురవుతాయి. పెద్ద శబ్దాలు వచ్చే బాంబులతో బెదురుతాయి. ఒక సందర్భంలో మృత్యువాత పడే అవకాశం ఉంటుంది. ఫలితంగా మన సరదా.. ప్రియనేస్తాలకు విషాదం అవుతుంది. ఈ నేపథ్యంలో దీపావళి రోజున బాణాసంచా పేల్చడం, మందుగుండు సామగ్రి కాల్చడంలో కొన్ని మెళకువలు పాటిస్తే పెంపుడు జంతువులకు ఎలాంటి ఆపద కలగదని వరంగల్ 46వ డివిజన్ మడికొండ పశువైద్యాధికారి కరుణాకర్ రెడ్డి తెలిపారు. దీపావళి సందర్భంగా పెంపుడు జంతువులు, పశుపక్ష్యాదుల యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను 'సాక్షి'కి వివరించారు. ఆవివరాలు ఆయన మాటల్లోనే..


పెంపుడు కుక్క

- పెంపుడు కుక్కలు, పక్షులు భారీ శబ్దాలకు గురికాకుండా చూడాలి. శబ్దం తక్కువ వచ్చే కిటికీలు, తక్కువ ఉన్న గదుల్లో ఉంచాలి. బాణాసంచా కాల్చే సమయంలో పెంపుడు జంతువులను ఎట్టి పరిస్థితుల్లో కట్టి ఉంచడానికి లేదా బోనులో పెట్టడానికి ప్రయత్నించొద్దు.
- పెంపుడు జంతువులు భయపడిన సందర్భంలో మంచం కింద దాక్కోవడానికి యత్నిస్తాయి. తమ యజమాని మీదకు ఎగబాకే అవకాశం ఉంది. అలాంటి సమయాల్లో వాటిని మందలించకుండా సముదాయించాలి.
- శబ్దాలు ఎక్కువ వచ్చే సమయంలో వాటికి ఇష్టమైన చూయింగ్ బోన్‌ను, ఆహారం వేస్తే కొంత వరకు ఆందోళన తగ్గొచ్చు.
- అపార్ట్‌మెంట్లలో శబ్ద తీవ్రత ఎక్కువ ఉంటుంది. అందుకే యజమానులు జంతువులను శబ్దం వినబడని గదుల్లో ఉంచి టీవీ, మ్యూజిక్ పెట్టడం ద్వారా జంతువుల్లో భయం పోగొట్టొచ్చు.
- పెంపుడు జంతువులు ఇష్టపడే సంగీతం, టీవీని పెట్టడం ద్వారా గాని శబ్దాల తీవ్రత తగలకుండా చూడాలి.
- బాణాసంచా పేలుడుతో వెలువడే విషవాయువుల వల్ల మనుషులకన్నా జంతువులకు ఎక్కువ హాని కలుగుతుంది. అలర్జీ, బ్రాంకైటిస్ వంటి వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది.
- దీపావళి తరువాత పెంపుడు జంతువులు, పక్షులు అనారోగ్యానికి గురైతే వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించాలి.
- తీవ్ర భయాందోళనలకు గురయ్యే పెంపుడు నేస్తాలకు వైద్యుడి సలహా మేరకు మత్తు మందులు అందించొచ్చు.



- పండుగ వేళ పక్షులు, కుందేళ్ల వంటి మూగ జీవాల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి. వాటిని బయట వదిలేయకుండా పూర్తిగా మూయబడిన పంజరాల్లో ఉంచడం వల్ల ఫలితం ఉంటుంది.
- దీపావళి సమయంలో ఎక్కువ నష్టపోయేది వీధి కుక్కలే.
- పెంపుడు జంతువుల్లో భయం పోగొట్టడానికి వాటిని మానసికంగా సిద్ధం చేసే యత్నం చేయాలి. అంటే చిన్న క్రాకర్స్ కాల్చుతున్నప్పుడు వాటిని పక్కన ఉంచుకోవాలి. అప్పుడు వాటిలో ఉన్న భయం మెల్లగా పోతుంది.
- పెంపుడు జంతువుల్లో బాణాసంచా శబ్దాల భయం పోగొట్టడానికి వాటి చెవుల్లో స్వల్ప కాటన్ బాల్స్ ఉంచొచ్చు.

దీపావళిని ఆనందంగా జరుపుకోవాలి

- 108 ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్

హన్మకొండ అర్బన్ : వెలుగుల పండుగ దీపావళిని ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని 108 ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్ అన్నారు. ఈ మేరకు దీపావళి పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను 'సాక్షి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

బాణాసంచా కాల్చుతున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- టపాసులు ఇంటి బయట దూరంగా పేల్చాలి.
- ధ్వని ఎక్కువ వచ్చే టపాసులు కాల్చకపోవడం ఎంతో మేలు.
- టపాసులు కాల్చుతున్న సమయంలో శరీరానికి వదులుగా ఉండే నూలు దుస్తులు ధరించాలి.
- పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దలు పక్కనే ఉండాలి.
- కాళ్లకు కచ్చితంగా చెప్పులు, కంటి అద్దాలు, మాస్క్ ధరించాలి.
- చేతులతో టపాసులు పేల్చకూడదు.

108కు వెంటనే సమాచారం ఇవ్వాలి


శివకుమార్

ప్రతి మండలంలో 24 గంటలు అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని 108 ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్ తెలిపారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే వెంటనే ముందు 108కు సమాచారం ఇవ్వాలన్నారు. గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఈదఫా మరిన్ని జాగ్రత్తలు పాటించి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

ప్రమాదం జరిగి గాయాలైనప్పుడు..

- వెంటనే 108 సిబ్బందికి సమాచారం ఇవ్వాలి
- కాలిన గాయాలపై 10 నుంచి 20 నిమిషాల వరకు చల్లని నీరు పోయాలి
- శుభ్రమైన గుడ్డతో కాలిన గాయాన్ని కప్పి ఉంచాలి
- కొబ్బరి నూనె, సిరా లాంటి ఆయిల్ గాయాల మీద పోయొద్దు.
- కాలిన గాయాలకు వైద్యుడి సలహా ప్రకారం ఆయింట్‌మెంట్ రాయాలి

నాణ్యమైన పరిశోధనలపై దృష్టి సారించాలి

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, నాణ్యమైన పరిశోధనలు జరిగేలా విభాగాల అధిపతులు, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు దృష్టి సారించాలని వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. బాధ్యతలు స్వీకరించాక తొలిసారి అన్ని విభాగాల అధిపతులు, ప్రిన్సిపాళ్లతో అకడమిక్ కమిటీ హాల్‌లో బుధవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సంవత్సరంలో సెమినార్, సింపోజియాన్ని తప్పనిసరిగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. అధ్యాపకుల కొరత ఉన్న చోట పార్ట్‌టైం అధ్యాపకులను డిపార్ట్‌మెంటల్ కమిటీ ద్వారా విభాగాధిపతులు నియమించుకోవాలని చెప్పారు.

ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీతకు సన్మానం..


వెంకట్రామ్‌రెడ్డిని సన్మానిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, విభాగాల అధిపతులు, ప్రిన్సిపాళ్లు

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న కేయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డిని వీసీ ప్రతాప్‌రెడ్డి, విభాగాల అధిపతులు, ప్రిన్సిపాళ్లు సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు సురేశ్‌లాల్, రమ, సైన్స్ డీన్ హనుమంతు, ఫిజిక్స్ విభాగం అధిపతి మంజుల పాల్గొన్నారు.



బీసీ కమిషన్ పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్ : నవంబర్ 2న బీసీ కమిషన్ బృందం జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య.. అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల రిజర్వేషన్ల దామాషాపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం 2వ తేదీన హనుమకొండ కలెక్టరేట్‌కు బీసీ కమిషన్ బృందం రానుందని తెలిపారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్ , తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి హాజరవుతున్నారని పేర్కొన్నారు. సమావేశానికి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అన్ని కుల సంఘాల ప్రతినిధులు రానున్నారని, వీరినుంచి బృందం సభ్యులు ఉదయం 10నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని వివరించారు. సాయంత్రం 4:30 గంటలకు కమిషన్ బృందం విలేకరుల సమావేశంలో మాట్లాడతారని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

అదనపు పరీక్షల నియంత్రణాధికారుల నియామకం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పరీక్షల విభాగంలో ఇద్దరిని అదనపు పరీక్షల నియంత్రణాధికారులుగా నియమించారు. ఈ మేరకు ప్రొఫెషనల్ కోర్సుల సెక్షన్ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆసిం ఇక్బాల్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా, ఆసిం ఇక్బాల్‌కు వీసీ ప్రతాప్‌రెడ్డి.. రిజిస్ట్రార్ మల్లారెడ్డితో కలిసి నియామక ఉత్తర్వులు అందజేశారు.

కాన్ఫిడెన్షియల్ విభాగం అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా నాగరాజు..

కాకతీయ యూనివర్సిటీలోని కాన్ఫిడెన్షియల్ విభాగం అదనపు పరీవక్షల నియంత్రణాధికారిగా ఫార్మసీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ బి. నాగరాజును నియమించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

డిగ్రీ సెక్షన్ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా తిరుమలాదేవి కొనసాగింపు..


ఆసిం ఇక్బాల్‌కు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కాకతీయ యూనివర్సిటీలోని పరీక్షల విభాగంలో డిగ్రీ సెక్షన్‌లోని అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మ్యాథ్స్‌విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ తిరుమలాదేవి పదవీ కాలం ముగియడంతో బుధవారం మరో సంవత్సరం పాటు కొనసాగిస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

పంచారామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం



హన్మకొండ: కార్తీక మాసం సందర్భంగా శైవ క్షేత్రాలైన పంచారామాల దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం హనుమకొండ నుంచి బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. కార్తీక సోమవారాలను పురస్కరించుకుని నవంబర్ 10, 17, 24, డిసెంబర్ 1 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధి చెందిన పంచారామ క్షేత్రాలు అమరావతి అమరలింగేశ్వర స్వామి, భీమవరం శ్రీసోమేశ్వర స్వామి, పాలకొల్లు క్షీరలింగేశ్వర స్వామి, ద్రాక్షారామం భీమేశ్వరస్వామి, సామర్లకోట భీమేశ్వర స్వామి వార్లను దర్శించుకునేలా బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఒకే రోజు ఐదు శైవ క్షేత్రాలను దర్శించుకోవడం ద్వారా భక్తులు ఆధ్యాత్మికంగా పరవశించిపోవచ్చన్నారు. ప్రతి ఆదివారం రాత్రి 8.00 గంటలకు హనుమకొండ బస్సు స్టేషన్ నుంచి బస్సు బయలుదేరుతుందని, సోమవారం అన్ని శైవ క్షేత్రాల దర్శనం అనంతరం తిరిగి మంగళవారం ఉదయం హనుమకొండకు చేరుకుంటుందన్నారు. డీలక్స్ సర్వీస్ చార్జీలు పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1200 నిర్ణయించినట్లు తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో సర్వీస్ నంబర్ 98888 ద్వారా బుక్ చేసుకోవాలని సూచించారు. అదే విధంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 15న తమిళనాడులోని అరుణాచలానికి ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు తెలిపారు. ఈ బస్సు నవంబర్ 13న హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి బయలుదేరుతుందన్నారు. అరుణాచలానికి బస్ చార్జీలు పెద్దలకు రూ.4500, పిల్లలకు రూ.3 వేలు నిర్ణయించినట్లు వివరించారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7382855492, 9959226056, 9959226047 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.





రైతులను ముంచిన వ్యక్తి అరెస్ట్

- రెండేళ్ల తర్వాత పట్టుకున్న పోలీసులు
- హర్షం వ్యక్తం చేసిన అన్నదాతలు


శంకర్

కురవి: 50 మంది రైతుల నుంచి రూ.26లక్షల విలువైన ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం వారికి డబ్బులు ఇవ్వకుండా పరారైన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గండ్రాతి సతీశ్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని రాజోలు శివారు పోలంపల్లి తండా గ్రామానికి చెందిన బాదావత్ శంకర్ రెండు సంవత్సరాల క్రితం ఇదే మండలంలోని స్టేషన్ గుండ్రాతిమడుగు, పెద్దతండా, చౌళ్ల తండా, బంచరాయి తండాతోపాటు మరికొన్ని తండాలకు చెందిన 50 మంది రైతుల నుంచి రూ.26 లక్షల విలువైన ధాన్యం కొనుగోలు చేశాడు. అనంతరం డబ్బులు చెల్లించకుండా భార్యాపిల్లలతో ఉడాయించాడు. ఈ ఘటనపై 2022 సంవత్సరంలో చౌళ్ల తండాకు చెందిన బట్టు లచ్చు ఫిర్యాదు మేరకు బాదావత్ శంకర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సతీశ్ నేతృత్వంలో శంకర్ కోసం గాలింపు చేపట్టారు. ఇతర రాష్ట్రంలో ఉంటున్న శంకర్‌ను విశ్వసనీయ సమాచారం మేరకు రెండేళ్ల తర్వాత బుధవారం పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. కాగా, శంకర్‌ను పట్టుకున్న ఎస్సై సతీశ్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- ఐటీడీఏ డీడీ పోచం
- ముగిసిన జోనల్ క్రీడలు


క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీడీ పోచం

ఏటూరునాగారం : క్రీడల్లో గెలుపోటములు సహజమని, గెలిచిన వారికి ఆనందం, ఓడిన వారికి అనుభవం మిగులుతుందని, ఈ అనుభవం రేపటి గెలుపునకు నాంది అవుతుందని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం అన్నారు. మండల కేంద్రంలోని కొమురం భీం స్టేడియంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల గిరిజన విద్యార్థుల జోనల్ స్థాయి క్రీడలు బుధవారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో కూడా మెరుగైన ప్రదర్శన ఇచ్చి ఐటీడీఏ ఏటూరునాగారానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏటీడీఓలు దేశిరాం, క్షేత్రయ్య, ఏసీఎంఓ రవీందర్, డిప్యూటీ డీఈఓ సారయ్య, ఎస్‌ఓ శ్యామలత, ఆదినారాయణ, డాక్టర్ కిస్టూ, నారాయణ, సీహెచ్ కొమ్మాలు, పీజీహెచ్‌ఎంలు ఎం.నాగేశ్వరరావు, కె.శ్రీనివాస్, పి.శ్రీనివాస్, డి.రేవతి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.







సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

హనుమకొండ కాజీపేటలో 413 చదరపు గజాల ప్లాటు అమ్మబడును. వెజిటేబుల్ మార్కెట్ దగ్గర (నో బ్రోకర్) డైరెక్ట్ పార్టీ సంప్రదించండి. సెల్: 9849129772. [W-1239932]

HOUSE FOR SALE

House for sale 164 Sq.yards West Face Near Releif Hospital Arepally WGL 70 Lakhs. Cell: 9652715142. [W-1237347]

SERVICES

LOSS OF CERTIFICATES

I, MATTEPALLY MANASA, D/o.MATTEPALLY KUMARA SWAMY, R/o. H.No. 2-8-260, Waddepally, Hanumakonda District, T.G., have lost my original SSC Certificate held in the year of March, 2018, with Roll. No. 1812107966 and Diploma Certificate held in the year March, 2021, Vide ODC No. 2108211816645, while traveling by Auto Journey from Residence to Nakkalagutta of Hanumakonda District on 12-10-2024. If anyone finds it, please inform them at the above address and contact number. 9000667492. [W-1239769]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

WANTED

ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Q: 10th- డిగ్రీ, Sal: 20K-30K. మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [W-1239931]

ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ వసతి ఫుడ్ , జీ: 20K, Ph: 8977639662, 8977639663 [SCA24000512]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.